సాక్షి
నల్లగొండ
మంగళవారం । 7 । ఫిబ్రవరి । 2023








లింగమంతుల స్వామిని దర్శించుకుంటున్న మంత్రులు జగదీశ్‌రెడ్డి, తలసాని శ్రీనివాస్ యాదవ్, శ్రీనివాస్‌గౌడ్, ఎంపీ బడుగుల లింగయ్య యాదవ్ తదితరులు



ఓ లింగా.. అంటూ శిగమూగుతున్న మహిళ

భక్త జన గట్టు



భక్తజనంతో నిండిపోయిన పెద్దగట్టు పరిసరాలు

దురాజ్‌పల్లి పెద్దగట్టు జనగట్టును తలపించింది. లింగమంతుల స్వామి జాతరలో భాగంగా రెండవ రోజు సోమవారం భక్తులు స్వామి, అమ్మ వారికి బోనాలు సమర్పించేందుకు తరలివచ్చారు. భేరీ చప్పుళ్లు, గంపలు, బోనాలతో మహిళలు, శివసత్తుల నృత్యాలు, ఓ లింగా.. ఓ లింగా నామస్మరణతో గొల్లగట్టు పరిసరాలు మార్మోగాయి. లింగన్న దర్శనానికి భక్తులు బారులుదీరారు.

- సూర్యాపేట, చివ్వెంల

- వివరాలు 10లో

న్యూస్‌రీల్

ఉచిత న్యాయ సహాయం అందిస్తాం



కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న జిల్లా ప్రధాన జడ్జి జగ్జీవన్‌కుమార్, ఇతర జడ్జీలు

రామగిరి(నల్లగొండ): జైళ్లలో ఉన్న విచారణ ఖైదీలకు ఉచిత న్యాయ సహాయం అందిస్తామని జిల్లా ప్రధాన జడ్జి బీఎస్.జగ్జీవన్‌కుమార్ తెలిపారు. సోమవారం జిల్లా కోర్టులో డిఫెన్స్ న్యాయవాదుల కార్యాలయాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. జిల్లా న్యాయ సేవాధికారి సంస్థ కార్యదర్శి బి.దీప్తి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు లింగంపల్లి శ్రీనివాస్, న్యాయమూర్తులు ఏ.జయరాజు, తిరుపతి, తేజోకార్తీక్, కీర్తి చంద్రికారెడ్డి, శ్రీవాణి, చీఫ్ డిఫెన్స్ కౌన్సిల్ నిమ్మల భీమార్జున్‌రెడ్డి, డిప్యూటీ కౌన్సిల్ మిర్యాల లెనిన్ బాబు, అసిస్టెంట్ డిఫెన్స్ కౌన్సిల్ మామిడి ప్రమీల, బార్ అసోసియేషన్ కార్యదర్శి శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

బడ్జెట్‌లో సాగర్ బుద్ధవనం ప్రస్తావనపై హర్షం

నాగార్జునసాగర్: తెలంగాణ అసెంబ్లీ సమావేశాల సందర్భంగా సోమవారం రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావు చేసిన బడ్జెట్ ప్రసంగంలో నాగార్జునసాగర్‌లోని బుద్ధవనం నిర్మాణం ప్రస్తావన ఉండటంపై బుద్ధవనం ప్రత్యేక అధికారి మల్లెపల్లి లక్ష్మయ్య హర్షం వ్యక్తం చేశారు. మంత్రి చేసిన బడ్జెట్ ప్రసంగంపై లక్ష్మయ్య స్పందించారు. ప్రాచీనకాలం నుంచి తెలంగాణ బౌద్ధ, జైనమతాలకు కేంద్రంగా విలసిల్లిందని, ఆచార్య నాగార్జునుడు నడయాడిన ప్రాంతమైన నాగార్జున సాగర్‌లో తెలంగాణ ప్రభుత్వం 274 ఎకరాల విస్తీర్ణంలో రూ.71కోట్లతో బుద్ధవనం ప్రాజెక్టును అద్భుతంగా నిర్మించి, అభివృద్ధి చేసిందని ప్రస్తావించారని పేర్కొన్నారు. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో బౌద్ధులను ఇతర పర్యాటకులను ఆకర్షిస్తుందని తెలిపారు.

కూరగాయల సాగుకు రుణాలిస్తాం : డీఆర్‌డీఓ



నెట్‌హౌస్‌ను ప్రారంభిస్తున్న డీఆర్‌డీఓ కాళిందిని, సర్పంచ్ వెంకటేష్‌గౌడ్

చిట్యాల: నెట్ హౌస్ పద్ధతిలో ఏడాది పాటు బహుళ కూరగాయల పంటలు సాగు చేసేందుకు స్వయం సహాయక సంఘాల మహిళలకు అవసరమైన రుణాలు అందజేస్తామని డీఆర్‌డీఓ కాళిందిని పేర్కొన్నారు. చిట్యాల మండలం పేరేపల్లి గ్రామంలో జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో క్లస్టర్ బేస్ నెట్‌హౌస్ ద్వారా ఉద్యాన రక్షిత పంటల సాగు, మార్కెటింగ్‌పై రైతులకు, మహిళలకు, ఉపాధి హామీ కూలీలకు సోమవారం ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. నాలుగు గుంటల స్థలంలో నెట్‌హౌస్ పద్ధతిలో బహుళ పంటల సాగులో భాగంగా కూరగాయలు, ఆకుకూరలు పండించేందుకు రూ.3లక్షల వరకు రుణాలను స్త్రీనిధి ద్వారా అందజేస్తామన్నారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ అంతటి వెంకటేష్‌గౌడ్, శ్రీనిధి మేనేజర్ మహేందర్, నెట్‌హౌస్ మేనేజర్ మధుప్రసాద్, ఆర్‌ఎస్‌ఈటీఐ డైరెక్టర్ ఈ.రఘుపతి, ఉద్యాన శాఖ అధికారి రావుల విద్యాసాగర్, పేరేపల్లి వ్యవసాయ రైతు ఉత్పత్తిదారుల సంఘం చైర్మన్ రూపని రమేష్ పాల్గొన్నారు.

కేటాయింపులు అంతంతే!

- గతేడాది కేటాయింపులకు మించని ప్రస్తుత నిధులు
- రానున్న ఏడెనిమిది నెలల్లో పూర్తి చేసే వాటికే..
- జిల్లాలో ప్రాజెక్టులకు రూ.647.53 కోట్లే..
- ఎస్‌ఎల్‌బీసీ సొరంగానికి లేని కేటాయింపులు
- ఎంజీ యూనివర్సిటీకి మొండిచేయి.. వేతనాల నిధులే కేటాయింపు



ఎస్‌ఎల్‌బీసీ సొరంగం

సాక్షి ప్రతినిధి, నల్లగొండ: జిల్లాలో సాగునీటి ప్రాజెక్టులకు ప్రతిపాదించినంతగా కేటాయింపులు జరగలేదు. ఎన్నికల సంవత్సరంలోనైనా పెద్ద మొత్తంలో నిధులను కేటాయించి దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న పనులను రాష్ట్ర ప్రభుత్వం పూర్తి చేస్తుందని భావించినా బడ్జెట్‌లో అందుకు అనుగుణంగా కేటాయింపులు జరుపలేదు. వచ్చే ఏడెనిమిది నెలల్లో పూర్తి చేయగలిగే పనులకే కేటాయింపులు జరిపింది. ముఖ్యంగా ప్రాజెక్టుల కింద రిజర్వాయర్లు, కాలువల పనులు, పాత కాలువల నిర్వహణ, డ్యాంల నిర్వహణకే నిధులను ఇచ్చింది. వాస్తవానికి జిల్లాలోని పెండింగ్ పనుల కోసం ఈ ఏడాదిలో రూ.1497 కోట్లు అవసరమని నీటిపారుదల శాఖ అధికారులు ప్రతిపాదించినా అందులో సగం నిధులను కూడా ఇవ్వలేదు. మహాత్మాగాంధీ యూనివర్సిటీలో విద్యార్థులకు మౌలిక సదుపాయల కల్పన, ఇతర అభివృద్ధి పనులకు రూ.40 కోట్లు అవసరమని ప్రతిపాదించనా పైసా ఇవ్వలేదు. వేతనాల బడ్జెట్ మాత్రమే కేటాయించి సరిపుచ్చింది.

ప్రధాన ప్రాజెక్టులకు ఈ ఏడాది అవసరమైన నిధులు (రూ.కోట్లలో)				
ప్రాజెక్టు	పనులకు	భూసేకరణకు	ఆర్‌అండ్‌ఆర్	మొత్తం
ఏఎంఆర్‌పీ	385	102	60	547
సాగర్	141	59	-	200
డిండి	550.60	140	59.40	750
మొత్తం	1076.6	301	119.4	1497

గతేడాది నుంచే కోత..

జిల్లాలోని ప్రాజెక్టులకు ప్రభుత్వం 2021–22లో ప్రస్తుతంతో పోల్చితే కొంత ఎక్కువే కేటాయించింది. గతేడాది నుంచే బడ్జెట్‌లో కోతలు విధిస్తూ వస్తోంది. అంతకుముందుతో పోల్చితే గతేడాది బడ్జెట్‌లోనే రూ.308.93 కోట్లు తగ్గిపోయింది. 2021–22 ఆర్థిక సంవత్సరంలో ఎస్‌ఎల్‌బీసీ, డిండి, నాగార్జునసాగర్ ప్రాజెక్టుల కింద పనుల కోసం రూ.956.73 కోట్లు కేటాయించగా, గతేడాది దానిని 647.80 కోట్లకు పరిమితం చేసింది. ఈసారి కూడా రూ.647.53 కోట్లు మాత్రమే కేటాయించింది.

లిఫ్టులకు సరిపోయేదెలా?

నాగార్జునసాగర్ పరిధిలో సీఎం కేసీఆర్ మంజూరు చేసిన ఎత్తి పోతల పథకాలకు ఈసారి బడ్జెట్‌లోనూ సరిపడ నిధులను కేటాయించలేదు. నాగార్జునసాగర్ ప్రాజెక్టు కింద పలు పనులకు రూ.147.73 కోట్లు కేటాయించింది. సీఎం శంకుస్థాపన చేసిన ముక్త్యాల, నెల్లికల్, అంబాభవాని, దున్నపోతుల గండి, బొత్తలపాలెం, కంబాలపల్లి, అయిటిపాముల, కేశవాపురం, జాన్‌పహాడ్, పెద్దగట్టు, ఏకే పహాడ్, వీర్లపాలెం, పొగిల్ల, తోపుచర్ల లిఫ్టులకు అధిక మొత్తంలో నిధులు అవసరమని ఇంజనీర్లే చెబుతున్నారు. కనీసంగా రూ.వేయి కోట్లు అవసరమని, అందులో ఒక్క నెల్లికల్ లిఫ్ట్ అంచనా వ్యయమే రూ.664.80 కోట్లుగా పేర్కొంటున్నారు. బుద్ధవనానికి రూ.38 లక్షలు కేటాయించారు.



నాగార్జునసాగర్ ప్రాజెక్టు

సొరంగానికీ అంతే..

ఎస్‌ఎల్‌బీసీ అంతర్భాగంగా ఉన్న ఎలిమినేటి మాధవరెడ్డి రెడ్డి ప్రాజెక్ట్ (ఏఎంఆర్‌పీ) నక్కలగండి సొరంగం పనులు ఇంకా 10 కిలోమీటర్లు పూర్తి చేయాల్సి ఉంది. గత అంచనాల ప్రకారమే రూ.900 కోట్లు అవసరమని చెబుతున్నారు. ప్రస్తుతం కేటాయింపుల్లో ఏఎంఆర్‌పీ మొత్తానికి రూ.250 కోట్లే కేటాయించింది. ఆ నిధులు రిజర్వాయర్లు, కాలువలు పనులకే సరిపోనున్నాయి.

డిండికి మరింతగా తగ్గిన నిధులు

డిండి ఎత్తిపోతల పథకానికి గతేడాది నుంచి భారీగా కేటాయింపులు తగ్గిపోతున్నాయి. 2021–22 ఆర్థిక సంవత్సరంలో డిండికి రూ.545.42 కోట్లు కేటాయించగా, గతేడాది వాటిని రూ.300.50 కోట్లకు పరిమితం చేసింది. ఈసారి మరో రూ.50 కోట్లకు కోత పెట్టి బడ్జెట్‌లో రూ.250 కోట్లే కేటాయించింది. ఈ పథకం కింద జిల్లాలో ఐదు రిజర్వాయర్ల పనులు కొనసాగుతున్నాయి. అందులో దేవరకొండ మండలంలోని గొట్టిముక్కల, డిండి మండలం సింగరాజుపల్లి, చింతపల్లి మండలం కిష్టరాయినపల్లి, చింతపల్లి, మర్రిగూడ మండలం శివన్నగూడెం రిజర్వాయర్లు ఉన్నాయి. వాటిల్లో గొట్టిముక్కల, సింగరాజుపల్లి పనులు ఇప్పటికే 90 శాతం వరకు పూర్తయిన నేపథ్యంలో మిగతా పనులను ప్రస్తుతం కేటాయించిన నిధులతో అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు. మిగతా వాటికి మాత్రం ఎక్కువ నిధులు అవసరమని పేర్కొంటున్నారు.

ఇవీ ప్రాజెక్టుల వారీగా బడ్జెట్‌లో కేటాయింపుల వివరాలు (రూ.కోట్లలో)	
ఏఎంఆర్‌పీ డ్యాం, దాని పనులకు 15	ఇతర ప్రధాన పనులకు 120
భూసేకరణకు 10.10	కాలువలు, నిర్వహణ 60
ఆర్‌అండ్‌ఆర్ 29.80	భూసేకరణకు 15.10
మొత్తం 250 కోట్లు	

ఉదయ సముద్రం పనుల్లో వేగం పెరిగేనా?

బ్రాహ్మణ వెల్లెంల ఉదయ సముద్రం ఎత్తిపోతల పనులు ఇప్పటికే 90 శాతం పూర్తయ్యాయి. ఇక కాలువల పనులు చేపట్టాల్సి ఉంది. అయితే అందులో భూసేకరణ, పరిహారం వంటి వాటికే పెద్దమొత్తంలో నిధుల అవసరం ఉంది. అయితే, ఏఎంఆర్‌పీ కింద బడ్జెట్‌లో కాలువలకు రూ.60 కోట్లు, ప్రధాన పనులకు రూ.120 కోట్లు కేటాయించిన నేపథ్యంలో అందులో బ్రాహ్మణ వెల్లంకు నిధులకు కేటాయించి పూర్తి చేస్తారా? అన్నది తేలాల్సి ఉంది.

మా 'స్టార్లు' మాకే కావాలి



ట్రాక్టర్, బైక్‌లపై కలెక్టర్‌కు వెళ్తున్న శిల్గాపురం గ్రామస్తులు



కలెక్టరేట్ ఏఓకు వినతిపత్రం అందిస్తున్న గ్రామస్తులు

- మా ఊరి ఉపాధ్యాయులను బదిలీ చేయొద్దు
- తిరుమలగిరి మండలం శిల్గాపురం గ్రామస్తుల వేడుకోలు
- కలెక్టరేట్, డీఈఓ కార్యాలయంలో వినతి పత్రాలు అందజేత

నల్లగొండ, తిరుమలగిరి(నాగార్జునసాగర్): సార్ మీకు దండం పెడతాం.. మా ఊరి పాఠశాల ఉపాధ్యాయులను మాత్రం బదిలీ చేయవద్దు.. మా ఉపాధ్యాయులు మాకే కావాలి.. మా పిల్లల బంగారు భవిష్యత్తుకు బాటలు వేస్తున్న ఇలాంటి ఉపాధ్యాయులను మార్చొద్దు అంటూ తిరుమలగిరి(సాగర్) మండలం శిల్గాపురం గ్రామస్తులు కోరారు. ఈ మేరకు సోమవారం ఇంటికి ఒకరు చొప్పున ట్రాక్టర్, బైక్‌ల మీద నల్లగొండకు వచ్చి కలెక్టరేట్‌లో, డీఈఓ కార్యాలయంలో వినతిపత్రాలు అందజేశారు. మా సార్లు మాకే కావాలంటూ ప్లకార్డులు, ఫ్లెక్సీల ప్రదర్శనతో అధికారులను వేడుకున్నారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు కట్టెబోయిన సైదయ్య, మరో ఉపాధ్యాయులు శివప్రసాద్ ఎనిమిదేళ్లుగా, మరో ఉపాధ్యాయుడు ఎరనాగుల సైదులు పదేళ్లుగా పని చేస్తున్నారని తెలిపారు. ప్రస్తుతం హెచ్‌ఎం సైదయ్య, శివప్రసాద్‌ను బదిలీ చేశారని, వీరు సెలవు దినాల్లో కూడా పాఠశాలను నడుపుతూ కరోనా లాంటి విపత్కర పరిస్థితుల్లో కూడా విద్యార్థులకు విద్యనందించారని అలాంటివారిని మా ఊరికే కేటాయించాలని విన్నవించారు. ఆరేళ్ల నుంచే పాఠశాలలో ఆంగ్ల మాధ్యమంలో బోధన చేస్తుండడంతో మా ఊరి నుంచి ఒక్క విద్యార్థి కూడా ప్రైవేట్ పాఠశాలకు వెళ్లడం లేదని, పైగా అనుముల మండలం పుల్లారెడ్డిగూడెం, ఆంజనేయ తండా విద్యార్థులు ఇక్కడికే వస్తున్నారని గ్రామస్తులు తెలిపారు. వినతిపత్రాలు అందజేసిన వారిలో గ్రామ సర్పంచ్ తుడుం రమణ ముత్తయ్య, ఉప సర్పంచ్ బేబికోటయ్య, పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ లలితవెంకన్న, గ్రామస్తులు కట్టెబోయిన అనీల్ కుమార్, పెద్దిరాజు, వెంకన్న, కృష్ణ, ఖలీల్, సత్యనారాయణ, కల్పన, లక్ష్మి, వరమ్మ, శావమ్మ, విమల, నాగలక్ష్మి, మంగమ్మ, శారద తదితరులు ఉన్నారు.

ప్రైవేట్‌కు పంపాల్సి వస్తుంది



మా పాఠశాలలోని సార్లు మా పిల్లలకు మంచి విద్యనందిస్తున్నారు. అందుకే మొదటి నుంచి కూడా మా పిల్లలను ప్రైవేట్ పాఠశాలకు పంపకుండా ఇక్కడే చదివిస్తున్నాం. మా బడి సార్లు వేరే బడికి బదిలీ చేస్తే మా పిల్లలను ప్రైవేట్ బడికి పంపాల్సి వస్తది.

- కొత్తపల్లి ప్రసాద్, విద్యార్థి తండ్రి

ఇక్కడే ఉండేలా చూడాలి



మా పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయులు పండుగ, సెలవు దినం అని లేకుండా ప్రతిరోజూ వచ్చి మా పిల్లలకు చదువు చెబుతున్నారు. పిల్లల భవిష్యత్తు కోసం ఇంతలా ఆలోచించే ఉపాధ్యాయులు బదిలీ చేయకుండా ఇక్కడే బోధించేలా చూడాలి.

- లలిత, ఎస్‌ఎంసీ చైర్‌పర్సన్

ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలి

- ప్రజావాణిలో అదనపు కలెక్టర్ భాస్కర్‌రావు

నల్లగొండ: ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదులను పెండింగ్ ఉంచకుండా సత్వరమే పరిష్కరించాలని అదనపు కలెక్టర్ భాస్కర్‌రావు అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి ఆయన హాజరై ప్రజల నుంచి 44 ఫిర్యాదులు స్వీకరించి మాట్లాడారు. కార్యక్రమంలో కలెక్టరేట్ ఏఓ మోతీలాల్, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

28లోగా సీఎంఆర్ అందించాలి

యాసంగి–2021–22 సీజన్ సీఎంఆర్‌ను ఈ నెల 28లోగా అందించాలని అదనపు కలెక్టర్ భాస్కర్ రావు మిల్లర్లను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో మిల్లర్లు, పౌరసరఫరాల శాఖ అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇప్పటికే 72 శాతం సీఎంఆర్ ఇచ్చారని, మిగిలిన 18 శాతాన్ని త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. సమావేశంలో డీఎస్‌ఓ వెంకటేశ్వర్లు, డీఎం నాగేశ్వర్‌రావు, మిల్లర్లు తదితరులు పాల్గొన్నారు.



అర్జీలు స్వీకరిస్తున్న అదనపు కలెక్టర్

మిర్యాలగూడ కాంగ్రెస్‌లో భగ్గుమన్న విభేదాలు

- డీసీసీ అధ్యక్షుడు శంకర్‌నాయక్, బీఎల్‌ఆర్ వర్గాల బాహాబాహీ



ఘర్షణ పడుతున్న శంకర్‌నాయక్, బీఎల్‌ఆర్ వర్గాల కార్యకర్తలు

మిర్యాలగూడ: మిర్యాలగూడలో కాంగ్రెస్ పార్టీ నాయకులు బాహాబాహీకి దిగారు. ఎల్‌ఐసీ ప్రైవేటీకరణను ఖండిస్తూ సోమవారం చేపట్టిన నిరసన కార్యక్రమంలో భాగంగా మిర్యాలగూడ ఎల్‌ఐసీ కార్యాలయం వద్ద నియోజకవర్గ నాయకుడు బత్తుల లక్ష్మారెడ్డి (బీఎల్‌ఆర్) వర్గం వారు టెంటు వేశారు. దీనికి అనుమతి లేదని పోలీసులు చెప్పడంతో ఆ వర్గం వారు ధర్నా చేయలేదు. డీసీసీ అధ్యక్షుడు కేతావత్ శంకర్‌నాయక్ వర్గం వారు ఆ టెంటు కిందనే ధర్నా చేశారు. అనంతరం స్థానిక పార్టీ కార్యాలయంలో హాథ్ సే హాథ్ జోడో పాదయాత్ర పోస్టర్‌ను ఆవిష్కరించేందుకు వచ్చారు. ఆ సమయంలోనే అక్కడికి వచ్చిన బీఎల్‌ఆర్ వర్గం.. తమకు సమాచారం ఇవ్వకుండానే ఎలా ధర్నా చేస్తారంటూ ప్రశ్నించారు. పైగా తమ నాయకుడు పార్టీ మారుతున్నాడంటూ అబద్ధపు ప్రచారం ఎందుకు చేస్తున్నారని గట్టిగా నిలదీశారు. దీంతో ఇరువర్గాల మధ్య ఘర్షణ వాతావరణం నెలకొంది. దూషణలు చేసుకొని అంతటితో ఆగకుండా అక్కడా కుర్చీలను ఒకరిపై ఒకరు విసిరేసుకున్నారు. ఇరువర్గాల కార్యకర్తలు ఒకరిపై మరొకరు పిడిగుద్దులు గుద్దుకున్నారు. దీంతో కార్యకర్తల దుస్తులు చిరిగిపోయాయి. ఎనిమిది మంది కార్యకర్తలకు గాయాలయ్యాయి. గాయాలైన వారిలో కౌన్సిలర్ దేశిరెడ్డి శేఖర్‌రెడ్డి ఉన్నారు. ఇరువర్గాలకు చెందిన నాయకులు, కార్యకర్తలు వన్ టౌన్ పోలీసులకు పరస్పరం ఫిర్యాదు చేసుకున్నారు.

వివాదం జరగడం బాధాకరం:శంకర్ నాయక్

మిర్యాలగూడ పట్టణ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో కార్యకర్తల మధ్య జరిగిన వివాదం బాధాకరమని డీసీసీ అధ్యక్షుడు కేతావత్ శంకర్‌నాయక్ అన్నారు. సోమవారం మిర్యాలగూడలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇక్కడ జరిగిన విషయమై రాష్ట్ర కమిటీకి నివేదించి అధిష్టానం ఆదేశానుసారం వివాదానికి కారణమైన వారిపై క్రమశిక్షణ చర్యలు తీసుకుంటామన్నారు. కార్యకర్తలు విభేదాలు మరిచి పార్టీ పటిష్టతకు కృషిచేయాలన్నారు. సమావేశంలో మాలోతు జనార్దన్, లింగానాయక్, నెహ్రూనాయక్, అంజి, భిక్షమాచారి తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీకి అధికారం ఖాయం

- టీపీసీసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు చెరుకు సుధాకర్



పాదయాత్రను ప్రారంభిస్తున్న డాక్టర్ చెరుకు సుధాకర్

నల్లగొండ: కాంగ్రెస్ పార్టీ తిరిగి అధికారంలోకి రావడం ఖాయమని టీపీసీసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ చెరుకు సుధాకర్ అన్నారు. పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి ప్రారంభిస్తున్న హాథ్‌సే హాత్ జోడోయాత్రకు మద్దతుగా కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు తండు సైదులుగౌడ్ ఆధ్వర్యంలో సోమవారం నల్లగొండ కలెక్టరేట్ నుంచి చేపట్టిన పాదయాత్రను సుధాకర్ ప్రారంభించి మాట్లాడారు. రాహుల్‌గాంధీ జోడోయాత్రను స్ఫూర్తిగా తీసుకొని రేవంత్‌రెడ్డి హాథ్ సే హాథ్ జోడోయాత్ర ప్రారంభించడం శుభపరిణామం అన్నారు. రాష్ట్రంలో కుటుంబ పాలన అంతం కావాలని.. రాబోయే ఎన్నికల్లో అన్ని అసెంబ్లీ స్థానాల్లో గెలిపే లక్ష్యంగా పెట్టుకొని ఈ యాత్రను చేపట్టారని గుర్తు చేశారు. ఆయనకు మద్దతుగా నలగొండ నియోజకవర్గం మొత్తం పాదయాత్ర చేస్తూ ప్రజల సమస్యలు తెలుసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ఎంపీటీసీ మట్టయ్య, మాజీ సర్పంచ్ కుక్కల సాలయ్య, కనగల్ కాంగ్రెస్ పార్టీ ఓబీసీ సెల్ వైస్ ప్రెసిడెంట్ గొని నరేష్, నాయకులు నర్సింగ్ మురళి, బత్తుల సోమరాజు, డైరెక్టర్ సైదులు, గుండు సంతోష్, విజయ్, రాజు, నందు, మహ్మద్‌అలీ, మునుగోటి యాదయ్య, కేశవులు, చెరుపల్లి సాగర్ తదితరులు పాల్గొన్నారు.



బోనమెత్తిన పెద్దగట్టు

లింగమంతుల జాతరకు పోటెత్తిన భక్తులు

- చౌడమ్మ తల్లికి బోనాలు సమర్పించిన యాదవ పూజారులు
- భక్తులతో కిక్కిరిసిన క్యూలైన్‌లు

సూర్యాపేట, చివ్వెంల/దురాజ్‌పల్లి : దురాజ్‌పల్లి శ్రీ లింగమంతుల స్వామి(పెద్దగట్టు) జాతరకు సోమవారం భక్తులు పోటెత్తారు. గట్టుకు నలుదిశలా ఉన్న దారుల నుంచి భక్తులు రావడంతో గట్టు అంతా జనంతో నిండిపోయింది. ఒక్కరోజే 8 లక్షలకు పైగా భక్తులు స్వామివారిని దర్శించుకున్నట్లు అంచనా. భక్తులు పెద్ద సంఖ్యలో తరలిరావడంతో క్యూలైన్లన్నీ కిక్కిరిసిపోయాయి. స్వామి వారి దర్శనం కోసం భక్తులు గంటల తరబడి వేచి ఉండాల్సి వచ్చింది. జాతరలో రెండవ రోజు ఘట్టమైన చౌడమ్మ బోనాల చెల్లింపు తంతును యాదవ పూజారులు భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. భక్తులు భేరీ చప్పుళ్లు, మంద గంపలు, బోనాలతో ఓ లింగా.. ఓ లింగా నామస్మరణతో శ్రీలింగమంతుల స్వామి, చౌడమ్మ తల్లికి ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. కొత్త కుండల్లో నెయ్యి, పసుపు, కుంకుమతో అమ్మవారికి నైవేద్యం వండి, ఊరేగింపుగా వచ్చి ఆలయం చుట్టూ ప్రదక్షిణ చేసి సమర్పించారు.

బోనాల సమర్పణ ప్రత్యేకత..

సంప్రదాయం ప్రకారం.. హక్కుదారులైన మున్న (రాజులు) మెంతబోయిన (పూజరులు) వంశస్తులు తమ ఇళ్ల నుంచి తెచ్చిన బియ్యంతో రెండు (రాశి, సందర) బోనాలు సమర్పించారు. బైకానివారు వాయిద్యాలు వాయిస్తుండగా మున్న వారు రాశిబోనాన్ని, మెంత బోయినవారు సందర బోనాన్ని మద్దెరపోలు ముందర ఇరువైపులా పెట్టారు. రాశి బోనం నుంచి కొంత అన్నం తీసి తమలపాకుల్లో పెట్టి దేవరపెట్టెకు నలుమూలలా ఉంచారు. అలాగే పాడి పసుపుతో వేసిన ముగ్గుపై రెండు తమలపాలకులతో, తడి పసుపుతో వేసిన ముగ్గుపై రెండు తమలపాలకులతో అన్నం నైవేద్యంగా పెట్టారు. మున్న, మెంతబోయిన వారు రాశి బోనం నుంచి కొంత అన్నం తీసి లింగమంతులస్వామి, చౌడమ్మ తల్లికి నైవేద్యంగా పెట్టి మొక్కులు చెల్లించారు. బైకాని వారు మద్దెరపోలు ముందు తెల్లని వస్త్రాన్ని పరిచి దానిపై పసుపుతో చక్రం ఆకారంలో ముగ్గు వేసి ముగ్గుపై నూనె పూసి పసుపు, కుంకుమతో బొట్లు పెట్టి అలంకరించిన రెండు అవసరాలు (కటార్లు) ఉంచారు. వీటిని ముందుగా హక్కుదారులైన మున్న (రాజులు) వంశస్తులు ఐదుగురు వరుసగా ఓ లింగా.. ఓలింగా.. అని స్మరిస్తూ అవసరాలను పైకెత్తి తమ ఛాతీకి ఇరువైపులా ఆనించుకోగా.. బైకాని వారు కథాగానం చేస్తూ మద్దెరపోలు ముందు మున్న, మెంతబోయిన వంశీయులతో దిబ్బం గడుపుట అనే కార్యక్రమం నిర్వహించారు. బైకాని పూజారి ముందుగా మున్న వంశీయుల మెడలో వీరతాడు వేసి స్వామి వైపు ఉన్న దిబ్బం (మట్టి కంచుడు) పైఉంచి మున్నవారు మెడలోని వీరతాడు కొనలు పట్టుకుని, కంచుడు లోని నూనెలో ముంచి, వెలుగుతున్న జ్యోతి చుట్టూ తిప్పి ముద్దెరపోలుకు హస్తాలు ఆనించి మొక్కారు. అలాగే మెంతబోయిన వారు కూడా సౌడమ్మ తల్లి వైపు ఉన్న దిబ్బంపై వంగి, మెడలోని వీరతాడును ఆ దిబ్బం చుట్టూ తిప్పి ముద్దెర పోలుకు హస్తాలు ఆనించి మొక్కారు. ఈ విధంగా బైకాని పూజారులు మున్న, మెంతబోయిన వారి మెడలో వీరతాళ్లు వేసి దిబ్బం మీద ప్రమాణం చేయిస్తే, వారు ఆచారం ప్రకారం లింగమంతుల స్వామి చౌడమ్మ జాతరను నిర్వహిస్తారని నమ్మకం. ముద్దెరపోలు కార్యక్రమం తర్వాత లింగమంతులస్వామి చౌడమ్మ తల్లి ఆలయానికి ఎదురుగా ఉన్న పోచమ్మ పోతరాజుల రాతి విగ్రహాల దగ్గర జంతుబలి కార్యక్రమం నిర్వహించారు. బైకాని వారు కథాగానం చేస్తుండగా తొలి గొర్రె (మెంతబోయిన వారిది), బద్దెపాల గొర్రె (మున్న వారిది), వరద గొర్రె (గొర్ల వారిది)లను చౌడమ్మ తల్లికి ఎదురుగా నిలబెట్టి హక్కుదారులైన మున్న, మెంతబోయిన వారు తమ సంప్రదాయ అవసరాలను గొర్రెలకు ఆనించి మొక్కారు. జడత ఇచ్చిన వెంటనే చౌడమ్మ తల్లికి మొదటగా బైకాని వారు తొలి గొర్రెను కోయగా తర్వాత బద్దె గొర్రెను, వరదగొర్రెను బలిచ్చారు. వరద గొర్రెను కోసేటప్పుడు గొల్లలు బిందెలతో నీళ్ల పోయగా, దాని రక్తం వరదగా ప్రవహించింది. బద్దిపాల గొర్రె రక్తపు చుక్కలను కొత్త కంచుడులో పోసి పాలు, నెయ్యి కలిపి బైకాని వారు మెంతబోయిన వంశీయులలో నిష్టతో ఉన్న వారికి తీర్థంగా పెట్టారు. తర్వాత బలిచ్చిన గొర్రెల మాంసాన్ని మున్న, మెంతబోయిన, బైకాని వారు వాటాలుగా పంచుకుని, తమ విడిది ప్రదేశంలో వండుకుని చౌడమ్మ తల్లికి నైవేద్యం పెట్టి మొక్కి భుజించారు. దీంతో బోనాల సమర్పణ ముగిసింది.



దురాజ్‌పల్లిలోని పెద్దగట్టు జాతరలో భక్తజన సందోహం



జాతరకు గొర్రె పొట్టేళ్లతో వస్తున్న భక్తులు



లింగమంతుల స్వామి దర్శనానికి పెద్దగట్టు పైకివెళ్తున్న భక్తులు



దేవరపెట్టెలో దేవతామూర్తుల విగ్రహాలు



కటార్లతో విన్యాసాలు చేస్తున్న బాలికలు



ఆలయం లోపల బారులుదీరిన భక్తులు

నేడు చంద్రపట్నం

జాతరలో మూడవరోజు మంగళవారం చంద్రపట్నం వేసి స్వామి వారి కల్యాణం నిర్వహించనున్నారు. ఇందుకోసం యాదవ పూజారులు, దేవాలయ అధికారులు సర్వం సిద్ధం చేస్తున్నారు.

భక్తుల జేబులకు చిల్లు

టెండర్‌లో నిర్ణయించిన ధరకు విరుద్ధంగా వ్యాపారులు జాతరలో తినుబండారాలు, కొబ్బకాయలు విక్రయించారు. కొబ్బరికాయ టెండర్ ధర రూ.40 కాగా రూ.50కు పైగా విక్రయించారు. మిఠాయి కేజీ రూ.200 , బొంగులు డబ్బా రూ.50 చొప్పున విక్రయిస్తున్నారు. ఎగ్జిబిషన్‌లో సైతం అధిక ధరలు ఉంటుండడంతో నిరాశ చెందుతున్నారు.

జాతరకు కేరాఫ్ మర్రిచెట్టు

పెద్దగట్టు జాతరకు కేరాఫ్‌గా అక్కడి మర్రిచెట్టు నిలుస్తోంది. భక్తులు పెద్ద సంఖ్యలో చెట్టు నీడలో సేదదీరడం కనిపించింది. తప్పిపోయిన వారిని గుర్తించేందుకు వారికి ఒక అడ్రస్‌గా మర్రిచెట్టుగా మారింది. వివిధ శాఖల అధికారులు కలుసుకోవాడానికి వేదికగా మారింది. మొత్తానికి పెద్దగట్టు జాతరకు కేరాఫ్ మర్రిచెట్టు అని భక్తులు పేర్కొంటున్నారు.



వైద్య శిబిరంలో సేవలందిస్తున్న సిబ్బంది

సాంకేతికతను వినియోగిస్తూ.. భక్తులకు భద్రతనిస్తూ..

- పెద్దగట్టు జాతరలో సీసీ, డ్రోన్ కెమెరాల ఏర్పాటు
- తొలిసారిగా ఎఫ్‌ఆర్‌ఎస్ టెక్నాలజీ వినియోగం
- బందోబస్తును పర్యవేక్షిస్తున్న సూర్యాపేట ఎస్పీ రాజేంద్రప్రసాద్



సీసీ టీవీలో బందోబసును పర్యవేక్షిస్తున్న ఎస్పీ

సూర్యాపేట క్రైం : రాష్ట్రంలో రెండో అతిపెద్ద జాతరగా పేరు గాంచిన శ్రీ లింగమంతులస్వామి (పెద్దగట్టు) జాతరపై పోలీస్ యంత్రాంగం పటిష్ట నిఘా ఏర్పాటు చేసింది. జాతరలో అల్లరిమూకలు, దొంగల ఆగడాలకు చెక్ పెట్టేందుకు ప్రత్యేక బృందాలు రంగంలోకి దిగాయి. ఆదివారం ఉదయం నుంచి సోమవారం సాయంత్రం వరకు ఎస్పీ రాజేంద్రప్రసాద్ జాతర వద్దే ఉండి బందోబస్తును పర్యవేక్షించారు. జాతరలో మహిళలను వేధించే వారి పట్ల కఠినంగా వ్యవహరించేందుకు షీ టీం, సీసీఎస్‌తో పాటు మఫ్టీ బృందాలు సంచరిస్తున్నాయి. మహిళల పట్ల ఎక్కడైనా అసభ్యకరంగా, అమర్యాదగా ప్రవర్తిస్తే వారిని ఈ బృందాలు అదుపులోకి తీసుకొనున్నాయి. ఈ బృందాల్లోని పోలీసులంతా జాతరకు హాజరయ్యే భక్తుల చుట్టూ తిరుగుతుంటారు. వారితో పాటు బాంబు, డాగ్ స్క్వాడ్‌లు తనిఖీలు చేస్తున్నారు. జాతరలో 60కి పైగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. జాతర వద్ద ఓ గుడారంలో సీసీ టీవీలకు సంబంధించిన కంట్రోల్ రూంను ఏర్పాటు చేశారు. ప్రత్యేకంగా ఎఫ్‌ఆర్‌ఎస్ (ఫేషియల్ రికగ్నైజేషన్ సిస్టమ్) టెక్నాలజీతో సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. వీటికి సుమారు 600 మంది పాత నేరస్తుల జాబితాను అనుసంధానం చేశారు. ఎవరైనా పాత నేరస్తులు జాతరలో సంచరిస్తే ఈ నిఘా నేత్రాలు పసిగట్టి కంట్రోల్ రూమ్‌కు సమాచారం చేరవేస్తాయి.

జాతీయ రహదారిపై ట్రాఫిక్ ఆంక్షలు

సూర్యాపేట క్రైం : శ్రీ లింగమంతుల స్వామి జాతర సందర్భంగా పోలీసులు జాతీయ రహదారిపై ట్రాఫిక్ ఆంక్షలు విధించారు. అందులో భాగంగా వాహనాలను దారి మళ్లిస్తున్నారు. విజయవాడ నుంచి సూర్యాపేట మీదుగా హైదరాబాద్ వెళ్లే వాహనాలను స్వామినారాయణ్ గురుకుల్ స్కూల్ ఎదురుగా ఉన్న ఎస్సారెస్పీ కెనాల్ రోడ్డు మీదుగా ఖమ్మం జాతీయ రహదారి 365బిబి రోళ్లబండ తండా వరకు మళ్లించి, జాతీయ రహదారి రాయినిగూడెం వద్ద యూటర్న్ చేసి హైదరాబాద్ వైపు పంపిస్తున్నారు.

- విజయవాడ నుంచి హైదరాబాద్ వెళ్లే భారీ, ట్రాన్స్‌పోర్టు వాహనాలను కోదాడ, నేరేడుచర్ల, మిర్యాలగూడ, నల్లగొండ మీదుగా నార్కట్‌పల్లి వద్దకు మళ్లిస్తున్నారు.
- కోదాడ, మునగాల, గుంపుల మీదుగా సూర్యాపేట పట్టణానికి వచ్చే ఆర్టీసీ బస్సులు, ఇతర చిన్న ప్రజా రవాణా వాహనాలు ఎస్సారెస్పీ కెనాల్ నుంచి బీబీగూడెం వద్ద నుంచి సూర్యాపేట పట్టణానికి పంపిస్తున్నారు.
- సూర్యాపేట పట్టణం నుంచి వెళ్లే ఆర్టీసీ బస్సులు, ప్రజా రవాణా వాహనాలు కుడకుడ గ్రామం మీదుగా ఐలాపురం వద్ద ఖమ్మం జాతీయరహదారి మీదుగా రాఘవపురం స్టేజి నుంచి నామవరం గ్రామం మీదుగా జాతీయరహదారి 65 పై గుంజలూరు స్టేజి వరకు మళ్లించి కోదాడ, విజయవాడ వైపునకు పంపిస్తున్నారు. అయితే, జాతరకు వెళ్ల వలసిన భక్తులు బస్సులో వస్తేనే సౌకర్యవంతంగా ఉంటుందని పోలీసులు సూచిస్తున్నారు.

బీజేపీ అధికారంలోకి వస్తే రాష్ట్ర పండుగగా గుర్తిస్తాం

- హుజూరాబాద్ ఎమ్మెల్యే ఈటల

చివ్వెంల (సూర్యాపేట) : బీజేపి అధికారంలోకి రాగానే శ్రీ లింగమంతుల స్వామి (పెద్దగట్టు) జాతరను రాష్ట్ర పండుగగా గుర్తిస్తామని హుజూరాబాద్ ఎమ్మెల్యే ఈటెల రాజేందర్ అన్నారు. జాతరలో భాగంగా రెండవ రోజు గట్టును సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో బీజేపీ అధికారంలోకి రాగానే సమ్మక్క-సారక్క జాతరను తలపించేలా మౌలిక సౌకర్యాలు కల్పిస్తామన్నారు. రాష్ట్రాన్ని ఉద్ధరిస్తానని చెప్పిన కేసీఆర్ ఇప్పుడు దేశ రాజకీయాల్లోకి వెళ్లి ఏమి చేస్తారో వేచి చూడాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సంకినేని వెంకటేశ్వర్ రావు తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న జానపద కళాకారుల ప్రదర్శన

జిల్లా పౌరసంబంధాల శాఖ ఆధ్వర్యంలో జాతరలో నిర్వహిస్తున్న జానపద ప్రదర్శన చూపరులను ఆకట్టుకుంది. డప్పు కళాకారులు, కోలాట కళాకారులు తమ విన్యాసాలతో భక్తులను మైమరపిస్తున్నారు.



డోలు వాయిస్తూ గట్టుకు వస్తున్న కళాకారులు

ప్రత్యేక ఆకర్షణగా శివసత్తులు



బోనాలతో వస్తున్న శివసత్తులు

జాతరలో శివసత్తులు ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. నెత్తిపై బోనం కుండ ఎత్తుకుని ఓ లింగా నామస్మరణతో నృత్యాలు చేస్తూ జాతరలో సందడి చేశారు. జాతరకు వచ్చిన భక్తులు వారి విన్యాసాలను చూసి మంత్ర ముగ్ధులయ్యారు.

రాత్రి వరకు తరలివచ్చిన గంపలు

భానుపురి : లింగమంతుల స్వామి జాతరలో ప్రధానంగా మొక్కుల చెల్లింపులో భాగంగా గంపలు చేయడం అనవాయితీ. ఏటా మధ్యాహ్నం వరకే పూర్తయ్యే కార్యక్రమం ఈ సారి రాత్రి 7, 8 గంటల వరకు కూడా గంపలతో కత్తి కటారుల విన్యాసాలతో గట్టుపైకి భక్తులు తరలిరావడం కనిపించింది. యాదవుల సాంప్రదాయ నృత్యాలు, కత్తి కటారు విన్యాసాలను భక్తులు ఆసక్తిగా తిలకించారు.



గంపలతో వస్తున్న మహిళలు



ట్రాక్టర్‌పై ఇళ్లకు వెళ్లపోతున్న భక్తులు

ఒక్క రోజుకే తిరుగు ముఖం

పదేళ్ల క్రితం భక్తులు ఎడ్లబండ్లతో జాతరకు వచ్చి మూడు నుంచి నాలుగు రోజులపాటు గుడారాలతో అక్కడే ఉండేవారు. ఈ ఏడు జాతరకు ఆదివారం సాయంత్రం వచ్చిన భక్తులు గంపలు బోనాలు చేసుకొని స్వామి అమ్మ వాళ్లకు అర్ధరాత్రి వరకు చెల్లించుకున్నారు. ఆ తర్వాత యాటలను బలిచ్చి సోమవారం సాయంత్రానికి ఇంటి ముఖం పట్టడం కనిపించింది.

భక్తులందరికీ రెండు చోట్ల షవర్లు

భక్తులదంరికీ ఆలయ ప్రాంగణంలో రెండు చోట్ల మాత్రమే షవర్లు ఏర్పాటు చేశారు. స్నానాలు చేసేందుకు సరిపడా షవర్లు లేక, ఉన్నవి కూడా ఒకే చోట ఏర్పాటు చేయడంతో మహిళలు ఇబ్బందులు పడ్డారు.



కోనేరు వద్ద స్నానాలు చేస్తున్న భక్తులు



కల్యాణ కట్టలో తలనీలాలు సమర్పిస్తున్న భక్తులు

ఎరుపెక్కిన గట్టు..

గొల్లగట్టు ఎర్రబడ్డది. యాదవులు స్వామివారికి కొబ్బరి కాయలు, బోనాలు చెల్లించి మొక్కులు చెల్లించుకోగా , అమ్మవారికి యాటలు బలి ఇచ్చారు. గతంలో గట్టుకు ఒకవైపు కేటాయించిన ఒక ప్రదేశంలో మాత్రమే యాటలను బలి ఇచ్చేవారు. కానీ ఈ జాతరలో తమకు నచ్చిన చోట గుట్టచుట్టూ యాటలను బలి ఇచ్చారు. దీంతో గుట్ట పరిసర ప్రాంతాల్లో రక్తపు మరకలే కనిపించాయి.



చౌడమ్మకు బోనం సమర్పించేందుకు వస్తున్న మహిళలు



లింగమంతుల స్వామి ఆలయం వెలుపల బారులుదీరిన భక్తులు

కేటాయింపులు ఎక్కువ.. ఖర్చు పెట్టేది తక్కువ : జూలకంటి



మిర్యాలగూడ: తెలంగాణ ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో కేటాయింపులు ఎక్కువగా ఉన్నాయని, కానీ ఖర్చు పెట్టేది మాత్రం తక్కువేనని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు జూలకంటి రంగారెడ్డి సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గృహ నిర్మాణానికి కేటాయించినట్లు ప్రకటించిన రూ.12వేల కోట్లు బడ్జెట్‌లో చూపలేదని, కార్పొరేషన్ ద్వారా తెచ్చే రుణాలతో నిర్మాణాలను చేపడతామమని చెప్పడం సరికాదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్‌లో అప్పులు 2024మార్చి నాటికి రూ.3,57,059 కోట్లుగా చూపారని, కానీ వాస్తవానికి కార్పొరేట్ అప్పులతో సహా లెక్కేస్తే రాష్ట్ర అప్పులు రూ.4.5లక్షల కోట్లకు చేరుకుంటుందన్నారు. తలసరి ఆదాయం రూ.3,17,115 ఉన్నట్లు ప్రకటించినప్పటికీ రాష్ట్రంలో పేదలు ఇంకా పేదలుగానే మగ్గుతున్నారన్నారు. రాష్ట్రంలో 37శాతం మంది పేదలు దారిద్ర్యరేఖకు దిగువగా ఉన్నారని ఆయన పేర్కొన్నారు. విద్యారంగానికి కేరళ రాష్ట్రం మాదిరిగా కేటాయింపులు చేయాలన్నారు. వైద్యారోగ్యానికి రూ.11,5265 కోట్లు కేటాయించామని చెబుతున్నప్పటికీ అనేక మంది పేదలు నేటికి సరైన వైద్యం అందక ఇబ్బందులు పడుతున్నారన్నారు. హోంశాఖకు రూ.9,598 కోట్లు కేటాయించినప్పటికీ రాష్ట్రంలోని మహిళలపై అఘాయిత్యాలు, కుల దురహంకార హత్యలు జరుగుతూనే ఉన్నాయన్నారు. సాగునీటి ప్రాజెక్టులకు రూ.26వేల కోట్లు కేటాయించినప్పటికీ ప్రభుత్వం కాలయాపన చేస్తుండడంతో అంచనాలు పెరుగుతూనే ఉన్నాయన్నారు. దళితులకు మూడెకరాల భూమి ఊసేలేదని, నిరుద్యోగ భృతి, గిరిజన బంధుకు బడ్జెట్‌లో కేటాయింపులు చేయలేదన్నారు.

ముగిసిన పూర్వగిరీశుడి బ్రహ్మోత్సవాలు

యాదగిరిగుట్ట: పూర్వగిరి లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ఏడురోజుల పాటు వైభవంగా కొనసాగిన బ్రహ్మోత్సవాలు సోమవారంతో ముగిశాయి. ఈ సందర్భంగా ఉదయం ఆలయంలో నిత్యారాధనలు నిర్వహించారు. అనంతరం ఉత్సవమూర్తులకు అష్టోత్తర శతఘటాభిషేకం చేశారు. ముఖ మండపంలో 108 కలశాలకు పూజలు నిర్వహించి స్వయంభూ, ప్రతిష్ఠామూర్తులను అభిషేకించారు. అనంతరం కలశాల ఎదురుగా హోమం నిర్వహించి పూర్ణాహుతి చేపట్టారు. ఆలయ అనువంశిక ధర్మకర్త నర్సింహమూర్తి, ప్రధానార్చకులు, ఉప ప్రధానార్చకులు, అధికారులు, ఆచార్యులు తదితరులున్నారు.



శతఘటాభిషేకం నిర్వహిస్తున్న ఆచార్యులు

కూలీల ట్రాక్టర్‌ను ఢీకొట్టిన ట్యాంకర్

- 15మందికి తీవ్ర గాయాలు.. ఇద్దరి పరిస్థితి విషమం
- అతివేగమే ప్రమాదానికి కారణం
- చిట్యాల మండలం పెద్దకాపర్తి శివారులో ఘటన



చిట్యాల: పెద్దకాపర్తిలో శివారు హైవేపై బోల్తాపడిన ట్రాక్టర్

చిట్యాల : అతివేగంగా వస్తున్న ట్యాంకర్ జాతీయ రహదారిపై యూటర్న్ తీసుకుంటున్న కూలీల ట్రాక్టర్‌ను ఢీకొట్టడంతో 15మందికి గాయాలయ్యాయి. చిట్యాల మండల పరిధిలో చోటుచేసుకున్న ఈ ఘటనపై పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఒడిశా, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాలకు చెందిన పలువురు కూలీలు కొంతకాలంగా సూర్యాపేటకు చెందిన కాంట్రాక్టర్ వెంకన్న వద్ద చెట్లు కొట్టే పనులు చేస్తున్నారు. అందులో భాగంగానే సుమారు 20మంది కూలీలు చిట్యాల మండల పరిధిలోని పెద్దకాపర్తి శివారులో కొన్ని రోజులుగా చేస్తున్న చెట్లు కొట్టే పనులు సోమవారం పూర్తి కావడంతో ట్రాక్టర్‌లో సూర్యాపేటకు బయలుదేరారు. ఈ క్రమంలో పెద్దకాపర్తి శివారులోని గాంధీ గుడి వద్ద హైవేపై ట్రాక్టర్ యూటర్న్ తీసుకుంటోంది. ఇదే సమయంలో హైదరాబాద్ నుంచి మిర్యాలగూడ వైపునకు వెళ్తున్న ట్యాంకర్ అతివేగంతో వచ్చి ఢీకొట్టింది. ప్రమాదంలో ట్రాక్టర్ ట్రాలీ హైవేపై బోల్తాకొట్టడంతో అందులో ప్రయాణిస్తున్న పలువురికి గాయాలయ్యాయి. క్షతగాత్రుల్లో 11మందిని నార్కట్‌పల్లి కామినేని ఆస్పత్రికి, మరో నలుగురు నల్లగొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతున్నారు. వీరిలో ఇద్దరు కూలీలు నిరంజన్, సాంబ పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలు స్తోంది. కాగా, కేసు దర్యాప్తు చేస్తున్నామని, ఫిర్యా దు రాత్రి వరకు అందలేదని ఎస్ఐ ధర్మా తెలిపారు.